క్లుప్తంగా

సోమసుందరేశ్వర ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు



కడప కల్చరల్: కడప నగరం గడ్డిబజారులోని శ్రీకామకోటి కళాంబ సోమసుందరేశ్వరస్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని మంగళవారం లెక్కించారు. జిల్లా దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ఎస్.జనార్దన్ ప్రత్యేక పరిశీలకుడిగా వచ్చిన ఈ కార్యక్రమం ఆలయ ఈఓ శ్రీధర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక ప్రముఖులు సుబ్బా రెడ్డి, అర్చకులు చంద్రమౌళిశర్మ, భక్తుల ఆధ్వర్యంలో హుండీ ఆదాయం లెక్కించగా మొత్తం రూ. 82,816 సమకూరినట్లు తెలిపారు.

విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ

వైవీయూ : కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు రెండునెలల ఇంటర్న్‌షిప్ పూర్తి చేసుకోవడంతో వారికి ప్రిన్సిపాల్ డా. పి. సుబ్బలక్ష్మమ్మ సోమవారం సర్టిఫికెట్లు ఎంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ జాతీయ నూతన విద్యావిధానం ప్రకారం విద్యార్థులు ఇంటర్న్‌షిప్ పూర్తి చేయాలన్నారు. ఇందులో భాగంగా ద్వితీయ సంవత్సరం పూర్తి చేసుకున్న 11 మంది విద్యార్థులు నగరంలోని గ్లోబల్ ఎలక్ట్రో మెకానికల్ ఎక్విప్‌మెంట్‌లో రెండునెలల పాటు పనిచేసి డ్రిప్ ఇరిగేషన్ పైప్స్ తయారీలో మెలకువలు నేర్చుకున్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు డా. పద్మావతి, విద్యార్థులు పాల్గొన్నారు.

భూ పంపిణీ చేపట్టాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: జిల్లాలో అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అసైన్ కమిటీ వేసి భూ పంపిణీ చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జి. చంద్ర పేర్కొన్నారు. సోమవారం జిల్లాలో అసైన్ కమిటీ ఏర్పాటు చేసి భూ పంపిణీ చేపట్టాలని కోరుతూ స్పందనలో సీపీఐ నాయకులు డీఆర్వో గంగాధర్ గౌడ్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు కెసీ బాదుల్లా, బషీరున్నీషా, ఆంజనేయులు, ఎంవి సుబ్బా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

కడప రూరల్ : ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను బలపరిస్తే నిరుద్యోగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్వతంత్ర్య అభ్యర్థి కమ్మూరు నాగరాజు తెలిపారు. సోమవారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో రేనాటి శ్రీనివాసులు, వసంత్, వెదురూరు బాబు, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

సామూహిక లక్ష్మీ పూజ

వల్లూరు : మండలంలోని మాచిరెడ్డిపల్లెలో వెలసిన శ్రీలక్ష్మీ నరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం సామూహిక లక్ష్మీపూజ కార్యక్రమం జరిగింది. వేద పండితులు పసుపు ముద్దలతో లక్ష్మీదేవి ప్రతిమలను చేసి దీపాలను వెలిగించి మహిళలచే సాంప్రదాయబద్ధంగా కుంకుమార్చనను నిర్వహించారు. ఉదయం వేద పండితుల ఆధ్వర్యంలో మూలమంత్ర, నవగ్రహ జపాలను, గణపతి, నారాయణ సూక్త, శ్రీ లక్ష్మీనృసింహ మంత్ర సంపుటిత హోమాలను వేద మంత్రాలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు.

ఘనంగా దర్గా ఉరుసు

కమలాపురం : మండలంలోని పందిళ్లపల్లెలో వెలసిన శ్రీహజరత్ మత్‌లూబ్ అలీషా దర్గా ఉరుసు మహోత్సవం వైభవంగా నిర్వహించారు. సోమవారం దర్గా పీఠాధిపతి మీరా మొ. దీన్ ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తుల నడుమ ఉరుసు మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులు స్వామి వారి మజార్‌పై పూల చాదర్ సమర్పించి ప్రత్యేక ఫాతెహా నిర్వహించారు. భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం ఏర్పాటు చేశారు.

నేటి నుంచి హజరత్ హుస్సేన్ వల్లి ఉరుసు

పెండ్లిమర్రి : మండలంలోని మొయిళ్లకాల్వ గ్రామంలో వెలసిన శ్రీనారాయణస్వామి ఆరాధన, శ్రీ హజరత్ హుస్సేన్ వల్లి ఉరుసు ఉత్సవాలు మంగళవారం నుంచి రెండు రోజుల పాటు వైభవంగా నిర్వహిస్తున్నట్లు దర్గా కమిటీ సభ్యులు తెలిపారు. మంగళవారం గంధంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. బుధవారం ఉరుసు ఉత్సవాలు, ఆలయ అవరణలో బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. అలాగే చెక్కభజన, చిన్నమ్మ కథ వంటి కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ట

వీరపునాయునిపల్లె : మండలంలోని ఎన్.పాలగిరి క్రాస్ వద్ద కాశిరెడ్డినాయ ఆలయ ప్రాంగణంలో మంగళవారం నుంచి మూడు రోజుల పాటు సాయిబాబా విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త పుల్లారెడ్డి తెలిపారు. గణపతి పూజ, గోపూజ, రక్షాబంధనం, కలశ స్థాపన, అగ్నిప్రతిష్ట, వాస్తుహోమం, మహా మంగళహారతి, గ్రామోత్సవం తదితర పూజా కార్య క్రమాలు నిర్వహిస్తామన్నారు.

స్పందన సమస్యలపై స్పందించాలి

– కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్



స్పందన కార్యక్రమంలో అర్జీలు స్వీకరిస్తున్న మున్సిపల్ కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్ : కడప నగర పాలక సంస్థ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమంలో వస్తున్న సమస్యలపై అధికారులు సత్వరమే స్పందించి పరిష్కరించాలని కమిషనర్ ఎస్ఎస్‌ప్రవీణ్‌చంద్ సూచించారు. సోమవారం ఆయన స్పందన కార్యక్రమంలో పాల్గొని ప్రజల అర్జీలను స్వీకరించారు. ఇందులో మొత్తం 59 అర్జీలు రాగా, ఇంజనీరింగ్ విభాగం 18, టౌన్ ప్లానింగ్ 15, పబ్లిక్ హెల్త్ 5, రెవెన్యూ విభాగం 5, యూపీఏ విభాగం 6, హౌసింగ్ విభాగం 4, తహసీల్దార్ 1, సీకే దిన్నె తహసీల్దార్ 1, ఎస్టాబ్లిష్‌మెంట్, ఏపీఎస్ పీడీసీఎల్, డిస్ట్రిక్ సర్వే విభాగం, ఇరిగేషన్ విభాగానికి సంబంధించి ఒక్కొక్క అర్జీ వచ్చింది. వీటిని క్షుణ్ణంగా పరిశీలించి తగిన పరిష్కారం సూచించాలని సంబంధిత శాఖాధిపతులకు సూచించారు. ఈ సందర్భంగా గత వారం వచ్చిన అర్జీల పరిష్కారంపై ఆయన ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ రాహుల్‌మీనా, డిప్యూటీ కమిషనర్ రమణారెడ్డి, ఎంహెచ్ఓ డాక్టర్ ప్రశాంత్ వర్ధన్, ఏసీపీ నాగేంద్ర, ఈఈలు, ఎస్ఈలు తదితరులు పాల్గొన్నారు.

అభ్యంతరాలు తెలపాలి

కడప కార్పొరేషన్ : కడప నగర పాలక సంస్థలో ఖాళీగా ఉన్న 22, 48 ఎలెక్షన్ డివిజన్లకు సంబంధించి పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితాను ఈనెల 6వ తేది ప్రచురించడం జరిగిందని మున్సిపల్ కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల సౌకర్యార్థం పోలింగ్ స్టేషన్ల జాబితాను కడప మున్సిపల్ కార్యాలయం, కలెక్టరేట్, జిల్లా కోర్టు, ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయం, సంబంధిత వార్డు సచివాలయాల్లో ప్రదర్శించడం జరిగిందన్నారు. గుర్తించిన పోలింగ్‌స్టేషన్ల జాబితాపై ఏవైనా అభ్యంతరాలు, సలహాలు ఉన్నట్లయితే ఈనెల 7వ తేదిలోగా లిఖిత పూర్వకంగా కడప నగర పాలక సంస్థ కార్యాలయంలో తెలియజేయాలని కోరారు.

పోస్టర్ల ఆవిష్కరణ

కడప కల్చరల్ : మహా కవియిత్రి మొల్లమాంబ సాహితీ జయంతి ఉత్సవాలకు రావాలని కవయిత్రి మొల్లమాంబ సాహిత్య పీఠం వ్యవస్థాపక అధ్యక్షులు విద్వాన్ గానుగపెంట హనుమంతరావు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాష, కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, నగర మేయర్ సురేష్ బాబులను ఆహ్వానించారు. సోమవారం తొలుత ఆయన డిప్యూటీ సీఎంను ఆయన కార్యాలయంలో కలిసి వారిచే ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరింపజేశారు. తొలుత డిప్యూటీ సీఎంను ఆయన కార్యాలయంలో కలిసి ఈనెల 12న కడప నగరంలో ఉదయం 10 గంటలకు మొల్లమాంబ జయంతి సందర్భంగా కడప నగరంలో సాహితీ ఉత్సవాలను నిర్వహిస్తున్నామని, ఆ కార్యక్రమానికి అతిథిగా రావాలని ఆహ్వానించారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి కవిత

కడప కోటిరెడ్డిసర్కిల్ /కడప ఎడ్యుకేషన్ : ప్రస్తుత సమాజంలో మహిళలు, యువతులు తమకు అవసరమైన చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి కవిత తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం కడప నగరంలోని శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల (స్విస్ట్)లో మహిళా చట్టాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. జడ్జి కవిత మాట్లాడుతూ కుటుంబ చట్టాలు, మెయింటెన్స్ చట్టాలు, గృహహింస, పౌర, క్రిమినల్ చట్టాలు, విద్యాహక్కు చట్టం, మహిళలకు ఆస్తిలో హక్కు, వివాహ వయస్సు, దిశా చట్టం, 304బి, ఉచిత న్యాయ సహాయం, జాతీయ లోక్ అదాలత్‌లు, వన్‌స్టాప్ సెంటర్ విధి విధానాలు, టోల్ ఫ్రీ నెంబర్లు తదితర వాటిని వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సుదర్శన్‌రెడ్డి, ప్రొఫెసర్లు, వనస్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అశ్విని, విద్యార్థినిలు పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగులకు క్రీడా పోటీలు



మహిళా ఉద్యోగుల ఆటల పోటీలను ప్రారంభిస్తున్న ఏపీ ఎన్జీఓ జిల్లా అసోసియేషన్ నాయకులు



ముగ్గుల పోటీలో పాల్గొన్న విద్యార్థినిలు

కడప రూరల్ : ఏపీ ఎన్జీఓ జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం సాయంత్రం స్థానిక జీయోన్ కళాశాల మైదానంలో మహిళా ఉద్యోగుల ఆటలపోటీలు ప్రారంభమయ్యాయి. షాట్‌పుట్, డిస్కస్ త్రో, మ్యూజికల్ చైర్స్, రన్నింగ్ తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించారు. మంగళవారం క్రీడా పోటీలు జరగనున్నాయి. అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు మాట్లాడుతూ మహిళా దినోత్సవ సందర్భంగా నిర్వహిస్తున్న ఈ పోటీలలో ప్రభుత్వ మహిళా ఉద్యోగులు పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రసాద్ యాదవ్, జిల్లా కార్యదర్శి రవికుమార్, కోశాధికారి నిత్య, జాయింట్ సెక్రటరీ రాజశేఖర్, మహిళా విభాగం చైర్మన్ శాంతమ్మ, కన్వీనర్‌భారతి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నిర్మలాజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కడప కోటిరెడ్డిసర్కిల్ : అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా ప్రతి ఏడాది లాగే ఈ ఏడాది కూడా నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో వివిధ పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థినిలకు నిర్వహించిన ముగ్గుల పోటీలు ఉల్లాస భరిత వాతావరణంలో కొనసాగాయి. అలాగే మ్యూజికల్ చైర్స్, టగ్ ఆఫ్ వార్, లెమన్ అండ్ స్పూన్, రన్నింగ్ రేస్ వంటి విభాగాల్లో విద్యార్థినిలు పాల్గొన్నారు. స్వర్ణ, కల్యాణి, రేఖలు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.

కార్యక్రమాలను సంస్థ ప్రతినిధులు పర్యవేక్షించి మాట్లాడుతూ విద్యార్థినిలు తాము ఎంచుకున్న రంగంలో రాణించి దేశం గర్వించే స్థాయికి చేరాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ సంస్థకు చెందిన సుబ్బరామిరెడ్డి, తేజ తదితరులు పాల్గొన్నారు.

వెన్నపూసను గెలిపించాలి



కలెక్టరేట్‌లో ప్రచారం నిర్వహిస్తున్న వెన్నపూస గోపాల్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గానికి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రభుత్వ విప్ వెన్నపూస గోపాల్‌రెడ్డి కోరారు. సోమవారం కొత్త కలెక్టరేట్‌లోని వివిధ విభాగాలకు చెందిన ఉద్యోగులను ఆయన కలిసి తన కుమారుడు వెన్నపూస రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం ఎల్‌బీసీ ఉద్యోగులు, సచివాలయ ఉద్యోగులు, నాగార్జున, సాయికృష్ణ పాఠశాలల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పురుషోత్తంరెడ్డి, కె.రాము, వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

హాకీ టోర్నమెంట్‌లో ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఏవీఆర్ విద్యాసంస్థల చైర్మన్ వెంకటేశ్వర్లు తదితరులు

కడప ఎడ్యుకేషన్: అనంతపురంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాలికల హాకీ టోర్నమెంట్‌లో కడప ఎన్‌జీవో కాలనీకి చెందిన గురుకుల విద్యాపీఠ్ విద్యార్థులు ప్రతిభ చాటి ప్రథమస్థానంలో నిలిచినట్లు ప్రిన్సిపాల్ మునిచంద్ర తెలిపారు. ఇందులో 9వ తరగతికి చెందిన హన్సిక, 7వ తరగతికి చెందిన నిషితలు హాకీ క్రీడలో చక్కటి నైపుణ్యాన్ని ప్రదర్శించి ప్రథమస్థానంలో నిలిచారన్నారు. అలాగే జిల్లాలోని ఏడీసీపీ ఓపెన్ చెస్ టోర్నమెంట్‌లో అండర్ 14 టాప్ 10 క్యాటగిరిలో 7వ తరగతి చదువుతున్న విద్యార్థి పృద్వీరాజు రెండు గోల్డ్ మెడల్స్ గెలుచుకున్నారన్నారు. ఇందుకు ఏవీఆర్ విద్యాసంస్థల చైర్మన్ వెంకటేశ్వర్లు, స్కూల్ డైరెక్టర్ వీరకుమారి, సీఈఓ వివేకానంద, పల్లవిలతో పాటు హెచ్ఎం మునిచంద్ర విద్యార్థులను అభినందించారు.

అభినందన



పీజీ విద్యార్థిని డాక్టర్ జ్యోత్స్నను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ

కడప అర్బన్: కడపలోని ప్రభుత్వ దంతవైద్య కళాశాలలోని చిన్నపిల్లల దంత వైద్య విభాగానికి చెందిన పీజీ దంతవైద్య విద్యార్థిని డాక్టర్ జ్యోత్స్నను సోమవారం తమ ఛాంబర్‌లో ప్రిన్సిపాల్ డాక్టర్ కె. సురేఖ అభినందించారు. డాక్టర్ జ్యోత్స్న ఫిబ్రవరి 24, 25 తేదీలలో చెన్నైలో సవిత డెంటల్ కళాశాలలో నిర్వహించిన జాతీయ కన్వెన్షన్‌లో బెస్ట్ పోస్టర్ అవార్డు గెలుచుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ కె. సురేఖతో పాటు, హెచ్ఓడి డాక్టర్ టి. కోటయ్యలు డాక్టర్ జ్యోత్స్నకు ప్రశంసాపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సహచర విద్యార్థులు డాక్టర్ లక్ష్మీ ప్రసన్న, డాక్టర్ అర్పిత పాల్గొన్నారు.

పని సర్దుబాటు అక్రమాలను నివారించాలి

కడప ఎడ్యుకేషన్: ఉపాధ్యాయుల పని సర్దుబాటులో జరిగిన అక్రమాలను సరిచేయడంతోపాటు అక్రమాలను ప్రశ్నించిన యూటీఎఫ్ నాయకులకు జారీ చేసిన షోకాజు నోటీసులను ఉపసంహరించుకోవాలని ఫ్యాప్టో నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ఫ్యాప్టో) కడప జిల్లాశాఖ ఆధ్వర్యంలో కడపజిల్లా ఫ్యాప్టో చైర్మెన్ విజయ్‌కుమార్, యుటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు, ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి ఇలియాష్‌బాష, ట్రెజరర్ మహబూబ్‌భాష, ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి తదితరులు జిల్లా కలెక్టర్ కార్యాలయ పరిపాలనాధికారి విజయ్‌కుమార్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భగా వారు మాట్లాడుతూ డీఈఓ అక్రమాలకు పాల్పడ్డారని ఆయన వైఖరి పట్ల సీనియర్ ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. దీనిపై జరిగిన లోపాలు, అక్రమాలను సరిచేయకపోతే ఈనెల 14వ నుంచి ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతామన్నారు.

ఘనంగా వార్షికోత్సవం



విద్యార్థులకు సర్టిఫికెట్‌తోపాటు బహుమతులను ప్రదానం చేస్తున్న కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్: కడప నగర శివార్లలోని కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాలలో సీఎస్సీ విభాగం ఆధ్వర్యంలో సీఎస్ఐ లోకల్ చాప్టర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం కళాశాలలో ప్రథమ వార్షికోత్సవాన్ని కళాశాల సభాభవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజింగ్ డైరెక్టర్ కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి(నాని) మాట్లాడుతూ సీఎస్ఐ చాప్టర్ భారతదేశంలో ప్రముఖ ప్రొఫెషనల్ కంప్యూటర్ ఇన్ సొసైటీ విభాగమని, గత ఏడాది ఫిబ్రవరి 25న సీఎస్ఐ ఏఐ అండ్ ఎంఎల్ శాఖలలో 72వ శాఖకు కళాశాలలో కొత్త అధ్యయనం ప్రారంభించామన్నారు. తద్వారా సీఎస్సీ విద్యార్థులకు కోడింగ్ కాంటెస్టు, వర్క్‌షాపు, గెస్ట్ ఉపన్యాసాలు, పేపర్, పోస్టర్ ప్రజెంటేషన్లు మొదలగు 18 రకాల ఈవెంట్లను ఒక ఏడాది పాటు నిర్వహించామని, ఇందులో ఉత్తమ ప్రదర్శన గావించబడిన విద్యార్థులకు బహుమతులు అందచేశామన్నారు. ఇంకా పలు అంశాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వీఎస్ఎస్‌మూర్తి, సీఎస్సీ విభాగాధిపతి లోకేశ్వరరెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ప్రేమ్‌కుమార్, ప్రోగ్రాం కో ఆర్డినేటర్లు శ్వేత, రామప్రకాష్‌రెడ్డి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మనోవిజ్ఞాన శాస్త్రంలో మరిన్ని పరిశోధనలు జరగాలి

– వైవీయూ స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ ఆచార్య పుత్తా పద్మ



సదస్సుకు హాజరైన పరిశోధకులు

వైవీయూ : మనోవిజ్ఞానశాస్త్రంలో మరిన్ని పరిశోధనలు జరగాల్సిన ఆవశ్యకత ఉందని వైవీయూ స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ ఆచార్య పుత్తా పద్మ పేర్కొన్నారు. యోగివేమన విశ్వవిద్యాలయంలో మనోవిజ్ఞానశాస్త్రశాఖ ఆధ్వర్యంలో రీసెర్చ్ మెథడాలజీ అండ్ డాటా అనాలసిస్ యూజింగ్ ఎస్.పి.ఎస్.ఎస్. సదస్సు ముగింపు సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడుతూ 5రోజుల పాటు నిర్వహించిన ఈ సదస్సులో తెలుసుకున్న అంశాల ద్వారా సమాజానికి మరింత మేలు జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పెరియార్ విశ్వవిద్యాలయం ఆచార్యులు జె. వెంకటాచలం క్వాలిటీ రీసెర్చ్ ఇన్ ఇండియా అన్న అంశంపై వివరించారు. సదస్సు కన్వీనర్లు డా. కె. లలిత, డా. లాజరస్‌లు మాట్లాడుతూ సదస్సు విజయవంతంగా ముగియడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం సదస్సుకు హాజరైన పరిశోధకులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డా. సరిత, డా. రియాజున్నీసా, డా. రవీంద్ర, డా. లక్ష్మీనరసింహ, డా. అశ్వర్థరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ విద్యార్థుల ప్రతిభ



విజేతలను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

కమలాపురం : కమలాపురంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు జాతీయస్థాయిలో ప్రతిభ కనబరిచారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.వెంకటేశ్వర్లు తెలిపారు. ఈనెల 2వ తేదీ నుంచి తమిళనాడులోని అవడిలో మురుగప్ప పాలిటెక్నిక్ కళాశాలలో జరిగిన నేషనల్ టెక్ ఫెస్ట్‌లో కమలాపురం పాలిటెక్నిక్ విద్యార్థులు దిలిప్‌కుమార్, నిర్మల్‌నారాయణ, నితిన్‌కుమార్‌రెడ్డి అశోక్, వీర వెంకటేష్‌లు ఎలక్ట్రానిక్ విభాగంలో ఏర్పాటు చేసిన నూతన ఆవిష్కరణకు ప్రథమ, ద్వితీయ బహుమతులు వచ్చినట్లు ఆయన వివరించారు. సోమవారం బహుమతులు పొందిన విజేతలను ఆయన అభినందించారు. సమాజానికి మరింత మెరుగైన ఆవిష్కరణలు చేయాలని, మరింత మంది విద్యార్థులు ఇటువంటి సాంకేతిక ప్రదర్శనల్లో పాల్గొనాలని ఆయన ఆకాంక్షించారు.

సహకార వ్యవస్థ ద్వారా గ్రామాల అభివృద్ధి సాధ్యం

– ఆప్‌కాబ్ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి



లబ్ధిదారునికి బంగారు నగల రుణాలకు సంబంధించిన మొత్తాన్ని అందచేస్తున్న మల్లెల ఝాన్సీరాణి

కడప అగ్రికల్చర్: సహకార వ్యవస్థ ద్వారా గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఆప్‌కాబ్ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి పేర్కొన్నారు. కడప మండల పరిధిలోని ఆలంఖాన్‌పల్లె సొసైటీలో బంగారు ఆభరణాలపై రుణాలు ఇచ్చే కార్యక్రమాన్ని డీసీసీ బ్యాంకు సీఈఓ రాజేంద్రకుమార్ ఆధ్వర్యంలో ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సహకార వ్యవస్థ ద్వారా గ్రామాల అభివృద్ధి సాధ్యం అని ప్రధానమంత్రి నరేంద్రమోడీ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిలు నమ్ముతున్నారని, అందుకోసం సొసైటీలను బలోపేతం చేయడానికి అన్ని చర్యలు చేపడుతున్నామన్నారు. సొసైటీలను మల్టీ సర్వీస్ సెంటర్లుగా మార్చడానికి నాబార్డు కేవలం 4 శాతం వడ్డీకి రుణాలు ఇస్తుందన్నారు. ఈ అవకాశాన్ని అన్ని సొసైటీలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సకాలంలో రుణాలు చెల్లించడం వలన మళ్లీ పెద్దమొత్తంలో రుణాలు పొందవచ్చన్నారు. అలాగే రికవరీ శాతం బాగుంటే నాబార్డు నుంచి ఫండ్స్ బాగా వస్తాయన్నారు. అనంతరం చైర్‌పర్సన్ చేతుల మీదుగా రుణాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆప్‌కాబ్ జనరల్ మేనేజర్ వెంకటరత్నం, ఓఎస్‌డీ సరేంద్రబాబు, డీపీడీఎం వీరశంకర్, డీసీసీ బ్యాంకు సీఈఓ కందుల రాజేంద్రకుమార్, సొసైటీ బ్యాంకు ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్లు రాజశేఖర్‌రెడ్డి, వైఎస్ఆర్‌సీపీ డివిజన్ ఇన్‌చార్జు మధువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

మార్కెట్ యార్డులో క్యాంటీన్ ఏర్పాటు



క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న మార్కెట్ యార్డు చైర్మన్ బంగారు గంగాదేవి, డైరెక్టర్ బంగారు నాగయ్య

కడప అగ్రికల్చర్: కడప మార్కెట్‌యార్డుకు వివిధ రకాల వ్యవసాయ దిగుబడులను తీసుకుని వచ్చే రైతులకు భోజనం అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో మార్కెట్‌యార్డులో క్యాంటీన్‌ను ఏర్పాటు చేస్తున్నామని మార్కెట్ యార్డు చైర్మన్ బంగారు గంగాదేవి, డైరెక్టర్ బంగారు నాగయ్య అన్నారు. కడప మార్కెట్‌యార్డులో ఏర్పాటు చేసిన క్యాంటిన్‌ను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో మార్కెట్‌మార్డులో క్యాంటీన్ అందుబాటులో లేకపోవడంతో రైతులు బాగా ఇబ్బందులు పడేవారన్నారు. దీంతోపాటు మార్కెట్ యార్డుకు వచ్చే రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను వదిలేసి భోజనం కోసం చాలాదూరం వెళ్లాల్సి వచ్చేదన్నారు. అందుకోసమే వారి సౌకర్యార్థం ఇప్పుడు యార్డులోనే క్యాంటీన్ ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్‌యార్డు ఉపాధ్యక్షులు గువ్వల మధుసూదన్‌రావు, పలువురు డైరెక్టర్లు, క్యాంటీన్ నిర్వాహకుడు మాలిక్ పాల్గొన్నారు.

పల్లకీలో ఊరేగిన వీరభద్రుడు

రాయచోటి టౌన్ : భద్రకాళి సమేత వీరభద్రస్వామి వారు పల్లకీలో ఊరేగారు. సోమవారం రాత్రి మూల విరాట్‌లకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి రంగు రంగుల పూలు, పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి భక్తులకు దర్శన ఏర్పాటు చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను అలంకరించి పల్లకీలో ఉంచి మాఢవీధులలో ఊరేగించారు. స్వామి వారి పల్లకీ ఉత్సవానికి స్థానిక భక్తులతో పాటు కన్నడ భక్తులు విశేషంగా పాల్గొన్నారు. పల్లకీ సేవలో ఆలయ పాలక మండలి అధ్యక్షురాలు పోలంరెడ్డి విజయ, ఆలయ ఈవో డివి రమణారెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు శంకరయ్యస్వామి, చంద్రశేఖర్‌స్వామి, నాగభూషణ్, సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

నాపరాయి పరిశ్రమను గట్టెక్కించండి

ఎర్రగుంట్ల : వేలాది కుటుంబాలు ఆధారపడి జీవనం సాగిస్తున్న నాపరాయి పరిశ్రమను గట్టు ఎక్కించాలని ఎర్రగుంట్ల గని, పాలీష్‌మీషన్ పరిశ్రమల యజమానులు ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డికి విన్నవించారు. సోమవారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మైనింగ్, విజిలెన్స్ శాఖ అధికారులు, పట్టణ నాపరాయి పరిశ్రమ యజమానులు ఎమ్మెల్యేను కలసి మాట్లాడారు. రాయల్టీ వల్ల పరిశ్రమ మనుగడ దెబ్బతింటోందని దీని వల్ల దీనిపై ఆధారపడ్డ వేలాది కుటుంబాలు రోడ్డున పడనున్నాయన్నారు. అలాగే ఈ పరిశ్రమలపై ఆధారపడి కట్టుడు రాళ్ల రవాణా చేసే ట్రాక్టర్ల యజమానులు ఉపాధి కోల్పోనున్నారన్నారు. పరిశ్రమకు సంబంధించి లైసెన్స్‌లు కూడా మంజూరు చేయాలని కోరారు. రాయల్టీ విధింపు మరోసారి పరిశీలించాలని వారు విన్నవించుకున్నారు. స్పందించిన ఎమ్మెల్యే రాయల్టీ విషయంలో పరిశ్రమలకు ఇబ్బందులకు గురి చేయకూడదన్నారు. దీనిపై మరోసారి పరిశీలించాలని మైనింగ్ విజిలెన్స్ అధికారులకు ఆయన సూచించారు. దీంతో ఆ శాఖ అధికారులు రెండు రోజులు గడువు ఇవ్వాలని వారు కోరారు.